

రంగంలోకి కీలక ప్రజాప్రతినిధి..

శృంగవరపుకోట తహసీల్దార్ డి.శ్రీనివాసరావును వెనక్కి రప్పించడంలో ఓ కీలక ప్రజాప్రతినిధి రంగంలోకి దిగినట్లు తెలిసింది. ఇటీవల ఓ కీలక శాఖ మంత్రి వద్ద ఎస్.కోట తహసీల్దార్‌తో పాటు మరో మండల తహసీల్దార్‌పై స్థానిక నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో వారిద్దరినీ మార్చాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు వెళ్లాయి. ఈ మేరకు ఈ రెండు మండలాలకు చెందిన తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. అయితే శృంగవరపుకోట తహసీల్దార్‌ను తిరిగి యథాస్థానంలో నియమిస్తున్నట్లు రాత్రికిరాత్రి మరో ఉత్తర్వు జారీకావడంతో కలెక్టరేట్ వర్గాల్లో పెద్దచర్చ జరుగుతోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జరిగిన బదిలీల్లో మార్పులు చోటు చేసుకోవడంతో కలెక్టరేట్ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి. దీని వెనుక పెద్ద రాజకీయం చోటు చేసుకుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికోసం ఈ నియోజకవర్గానికి అనుకుని ఉన్న ఓ కీలక ప్రజా ప్రతినిధి రంగంలోకి దిగినట్లు తెలిసింది. ఇతనే మంత్రితో మాట్లాడి శ్రీనివాసరావును తిరిగి వెనక్కి రప్పించడంతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులకు సర్దిచెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

బదిలీలీలలు

శృంగవరపుకోట తహసీల్దార్ డి.శ్రీనివాసరావును మెంటాడ తహసీల్దార్‌గా నియమిస్తూ గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రభుత్వం తొలుత ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడకు అల్లూరి సీతారామరాజు జిల్లా డుబ్రిగూడ మండల తహసీల్దార్ వి.త్రినాథరావు నాయుడును నియమిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. అయితే గంటల వ్యవధిలోనే ఈ ఉత్తర్వులు మారిపోయాయి. శ్రీనివాసరావును యథాస్థానం ఎస్.కోట లోనే కొనసాగిస్తూ గురువారం రాత్రి 8 గంటల సమయంలో ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీ చేసింది. త్రినాథరావును మెంటాడకు బదిలీ చేస్తున్నట్లు అందులో పేర్కొంది.

-శృంగవరపు కోట

- తహసీల్దార్ల బదిలీల్లో రాజకీయ జోక్యం
- నచ్చిన వారిని నియమించుకుంటున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులు
- మెంటాడకు బదిలీ అయిన ఎస్.కోట తహసీల్దార్
- గంటల వ్యవధిలోనే మళ్లీ వెనక్కి రప్పించుకున్న వైనం

Sl. No.	Name of the Tahsildar	Present Place of working	On transfer posted as
26	D.Srinivasa Rao	Tahsildar, S.Kota	Transferred and posted Tahsildar, Mentada
2	V.Thrinadha Rao Naidu	Tahsildar, Dumbriguda, (Visakhapatnam Erstwhile district)	Tahildar, S.Kota

ఎస్.కోట తహసీల్దార్ డి.శ్రీనివాసరావును మెంటాడకు, డుబ్రిగూడ తహసీల్దార్ వి.త్రినాథరావునాయుడును ఎస్.కోటకు బదిలీ చేసినట్లు తొలుత ఉత్తర్వు జారీ చేసిన దృశ్యం

జిల్లాలో తహసీల్దార్ల బదిలీల్లో రాజకీయ జోక్యం చోటుచేసుకుందనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల వేళ ఎంతో పారదర్శకంగా జరగాల్సిన అధికారుల బదిలీలు ప్రజాప్రతినిధుల జోక్యంతో గాడి తప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన అధికారులను నచ్చిన చోటకు బదిలీ చేసుకున్నట్లు తెలుస్తోంది. తహసీల్దార్ల సొంత జిల్లా, వారు పని చేసిన జిల్లాలను బట్టి వారిని ఏ జిల్లాకు కేటాయిస్తారో ముందుగానే ఊహించారు. దీనికితోడు సీసీఎల్ఏ (భూపరిపాలన శాఖ) అధికారుల నుంచి జిల్లాలకు కేటాయించే తహసీల్దార్ల జాబితాను సైతం ముందుగానే తెలుసుకున్నారు. దీంతో ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా ఉన్న తహసీల్దార్లకు తమకు నచ్చినచోట పోస్టింగ్ ఇప్పించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు శృంగవరపుకోట నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన తహసీల్దార్‌ను ఆరు నెలల క్రితం రాజకీయ కారణాలతో ఇక్కడ ప్రజాప్రతినిధికి ఇష్టం లేకుండా వేరే మండలానికి పంపించేశారు. అదే తహసీల్దార్‌ను ప్రస్తుతం జరిగిన బదిలీల్లో తన పాత మండలానికి తీసుకొచ్చేశారు సదరు ప్రజాప్రతినిధి. మరో మండలానికి చెందిన తహసీల్దార్ తనకు అనుకూలంగా ఉండడంతో ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ఆయన్ను కదిలించకుండా జాగ్రత్తపడ్డారు. బదిలీల్లో ఎస్.కోటకు ముందుగా నియమించిన తహసీల్దార్ పక్క జిల్లాలో గతంలో టీడీపీలో కీలక ప్రజా ప్రతినిధిగా వ్యవహరించిన ఓ మహిళ నేతకు బంధువుగా తెలుస్తోంది. దీంతో ఎన్నికల సమయంలో ఇబ్బందులు వస్తాయన్న అనుమానంతో ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన తహసీల్దార్‌ను తనకు అనుకూలంగా మలుచుకు న్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో పనికొస్తారన్న తహసీల్దార్లను ప్రజాప్రతినిధులు ఎంపిక చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పని చేసిన చోట మూడేళ్లు పూర్తి కాకుండా ఉన్న తహసీల్దార్లతో పాటు రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న తహసీల్దార్లను, ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లలో ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారిని కీలక స్థానాల్లో కూర్చోబెట్టారు. వీరంతా అధికార పార్టీకి ఎన్నికల సమయంలో సహకరించే అవకాశం ఉంది. దీంతో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

ORDER:

In accordance with the instructions issued in the reference 1st & 2nd read above, the CCLA, A.P., Mangalagiri has issued orders transferring the Tahsildars and allotted the Tahsildars to Vizianagaram District from other Districts of Zone I in connection with the General Elections to House of People (Lok Sabha) & Legislative Assembly 2024.

In pursuance of the orders issued by the CCLA, A.P., in the ref. 3rd read above, the posting orders issued to the Tahsildars who are allotted to Vizianagaram district vide reference 4th read above.

In partial modification of orders issued in the reference 4th read above, the following transfers and postings are hereby ordered.

Sl. No.	Name of the Tahsildar	Present Place of working	On transfer posted as
1	D.Srinivasa Rao	Tahsildar, S.Kota who is transferred and posted as Tahsildar, Mentada	Retained as Tahsildar, S.Kota
2	V.Thrinadha Rao Naidu	Tahsildar, Dumbriguda, (Visakhapatnam Erstwhile district) who is under the orders of Tahsildar, S.Kota	Posted as Tahsildar, Mentada

శ్రీనివాసరావును తిరిగి ఎస్.కోటకు, త్రినాథరావును మెంటాడకు బదిలీ చేస్తూ మరో ఉత్తర్వు జారీ చేసిన దృశ్యం

పారిశ్రామిక యూనిట్లపై దృష్టి పెట్టండి: కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, ఫిబ్రవరి 2: ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వివిధ పారిశ్రామిక యూనిట్ల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక మండలి సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మెరకము డిదాం మండలం గర్భాం వద్ద సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ ప్లాంట్, భీమాలి వద్ద మామిడి తాండ్ర తయారీ క్లస్టర్ ఏర్పాటు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా వివిధ పథకాల కింద ఇప్పటివరకూ అనుమతులు మంజూరు చేసిన యూనిట్లను వెంటనే ప్రారంభించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ డీఐసీ, కేవీఐసీ, కేవీఐబీల ద్వారా సుమారు 1152 యూనిట్లు మంజూరు చేసిటన్లు చెప్పారు. ఇప్పటికే 681 యూనిట్లు ఏర్పాటయ్యాయని, మిగిలినవి కూడా స్థాపించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడల స్థాపనకు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మేనేజరు పాపారావు, డీడీ నాగేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీ మోహన్, వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు, ఉద్యాన శాఖ డీడీ జమదగ్ని, మత్స్య శాఖ డీడీ నిర్మలా కుమారి, డీపీవో శ్రీధర్‌రాజా, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, ఆర్డీవో సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

చిన్న శ్రీనుకు ఎంపీ టికెట్ లేనట్టే?

- ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గా నియమించిన అధిష్ఠానం

విజయనగరం, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) బరిలోకి దిగే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. కానీ ఆయనకు ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గా అధిష్ఠానం అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనకు విజయనగరం ఎంపీ టికెట్ లేనట్లేనని స్పష్టమవుతోంది. మరోవైపు ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను అధిష్ఠానం పిలిచింది. ఈసారి ఎంపీ టికెట్ మార్పుపై ఆయనతో చర్చలు జరిపినట్లు సమాచారం. బొత్స ఝాన్సీ లక్ష్మికి విశాఖ ఎంపీ టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. అయితే, బెల్లానకు మరోసారి విజయనగరం ఎంపీ టికెట్ ఇస్తారా? లేక కొత్త అభ్యర్థిని అధిష్ఠానం ప్రకటిస్తుందా? అనేది చూడాలి.

ఎక్కడి పనులు అక్కడే!

- రాజాంలో రోడ్ల నిర్మాణాలకు బ్రేక్
- బిల్లులు చెల్లించకపోవడంతో నిలిపేసిన కాంట్రాక్టర్లు
- సంతకవిటి రహదారి నిధులు వెనక్కి
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



● రాజాం నుంచి సంతకవిటి మీదుగా శ్రీకాకుళం జిల్లా పొందూరును కలుపుతూ 16 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రెండేళ్ల కిందట రూ.50 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందో? లేదో? అని కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో ఈ రోడ్డుపై ఎక్కడికక్కడే గోతులమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రెండేళ్లలో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు.

● రాజాం మునిసిపాల్టీ పరిధిలో రోడ్డు నిర్మాణానికి ఏడాది కిందట ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. గుంటూరుకు చెందిన ఓ కాంట్రాక్టరు పనులను దక్కించుకున్నాడు. సుమారు రూ.6 కోట్ల పనులు సైతం పూర్తిచేశాడు. కానీ ఒక్క రూపాయి కూడా బిల్లు కూడా ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు.



● రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి రేగిడి మండలం దేవుదల వరకూ రహదారి నిర్మాణానికి నాలుగు నెలల కిందట ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించింది. కానీ పనులు ఎక్కడికక్కడే పెండింగ్‌లో ఉన్నాయి. ఉంగరాడ మెట్ట, మజ్జిరాముడు పేట వద్ద సీసీ రోడ్ల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. ఈ మార్గంలో చెరకు లారీలు, ట్రాక్టర్లు, క్వారీ లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో పనులు చేపట్టిన చోట పరిస్థితి మరింత తీసికట్టుగా మారుతోంది. అక్కడ వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.



రాజాం, ఫిబ్రవరి 2

రాజాం నియోజకవర్గంలో రహదారులు దారుణంగా ఉన్నాయి. ముఖ్యంగా మునిసిపాల్టీలో రోడ్లు ఆనవాళ్లు కోల్పోయాయి. రోడ్ల విస్తరణ సైతం అస్తవ్యస్తంగా మారింది. రెండేళ్ల కిందట ప్రారంభించిన విస్తరణ పనులు ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదు. కనీసం ఇప్పటి వరకు కాలువలు నిర్మించలేకపోయారు. రెండేళ్ల కిందట బొబ్బిలి రోడ్డు నుంచి గాయత్రీనగర్ వరకూ, అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ రహదారి విస్తరణ, కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. దీంతో పట్టణ స్వరూపమే మారిపోతుందని వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ప్రారంభించాడు. గత నవంబరు వరకూ సుమారు రూ.6 కోట్ల పనులు చేపట్టాడు. అయితే బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం మొండిచేయి చూపింది. దీంతో పనులు చేయలేనని కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వర్షాకాలంలో అయితే ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ రహదారి పరిస్థితిపై స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులును స్థానికులు నిలదీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా సరే పరిస్థితిలో మార్పు రావడం లేదు.

పెండింగ్ పనులు పూర్తయ్యేనా?

రేగిడి ఆమదాలవలస మండలంలో చక్కెర కర్మాగారం ఉంది. ఆపై రాతి క్వారీలు ఉన్నాయి. దీంతో రాజాం పట్టణం మీదుగా చెరకు లారీలు, ట్రాక్టర్లతో పాటు క్వారీ లారీలు వెళుతుంటాయి. దీంతో రహదారి పూర్తిగా ఛిద్రమైంది. నాలుగు నెలల కిందట రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి దేవుదల గ్రామం వరకూ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. పలు గ్రామాల్లో సీసీ రహదారులు, కల్వర్టుల పనులు చేపట్టకుండా జాప్యం చేస్తున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక సంతకవిటి మండల కేంద్రం వెళ్లాలన్నా.. అక్కడ నుంచి శ్రీకాకుళం జిల్లా పొందూరు వెళ్లాలన్నా నరకయాతన తప్పడం లేదు. రెండేళ్ల కిందట 16 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. కానీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. అటు వంగర మండల కేంద్రానికి వెళ్లాలన్నా నరకయాతనే. రాజాం నియోజకవర్గంలో ఏ రహదారి చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై రాజాం ఆర్‌అండ్‌బీ ఏఈ ఎ.నాగభూషణరావు వివరణ కోరగా.. 'ఇంతవరకు చేపట్టిన పనులకు బిల్లులు చెల్లిస్తేనే పెండింగ్ పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు మొండిగా సమాధానం చెబుతున్నారు. పనులు పూర్తిచేయక పోవడంతో ఒత్తిడి తీవ్రంగా ఉంది. నిధులు మంజూరైతే తప్ప ఏం చేయలేం' అని చెప్పారు.



రాజాంలో భోజన ప్లేట్లతో ఎండలో నిల్చొన్న మహిళలు



జామి: ఆసరా సభ వద్ద భోజనాల కోసం ఎగబడుతున్న మహిళలు

ఆసరా సదస్సులో ఆకలి కేకలు

- మండుటెండలో మహిళల ఇబ్బందులు
- సభ నుంచి వెనుదిరిగిన వైనం

రాజాం/రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఆసరా సదస్సు రచ్చర చ్చగా మారింది. సదస్సు నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. సమావేశానికి హాజరుకాకపోతే ఆసరా డబ్బులు ఖాతాలో వేయమని డ్వాక్రా మహిళలను బెదిరించి ఆటోల ద్వారా సదస్సుకు తరలించిన అధికారులు వారికి కనీస సౌకర్యాల కల్పనలో ఘోరంగా వైఫల్యం చెందారు. ఫలితంగా నిలువనీడ లేక, గుక్కెడు నీరు, తినేందుకు భోజనం దొరక్క మహిళలు నరకం చూశారు. దీంతో శాపనార్థాలు పెడుతూ ఈసురోమంటూ మహిళలు ఇంటిబాట పట్టారు. రాజాం మున్సిపాలిటీతో పాటు రూరల్ ప్రాంతంలోని 6,500 మంది డ్వాక్రా మహిళలతో అంతకాపల్లి గ్రామంలో ఆసరా సదస్సు నిర్వహించారు. ఉదయం 10 గంటలకే మహిళలు చేరు కున్నారు. అయితే, మధ్యాహ్నం 12 గంటల దాటాక వైసీపీ ముఖ్యనేతలంతా సదస్సుకు హాజరయ్యారు. అయితే, వీరికి తగ్గట్లు ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకులు విఫలమయ్యారు. పూర్తిస్థాయిలో టెంట్లు వేయకపోవడంతో ఎండకు తట్టుకోలేక మహిళలు విలవిల్లాడారు. దీంతో సమా వేశం జరుగుతుండగానే వెనుదిరిగారు. ఎండలో తమను కూర్చోబెట్టారని, కనీసం తాగటానికి నీరు కూడా ఇవ్వలేదని వైసీపీ నేతలపై మహిళలు మండిపడ్డారు. సదస్సుకు సమీపంలోని పొలంలో భోజనం ఏర్పాట్లు చేశారు. నీడ లేకపోవడంతో మండుటెండలో ప్లేట్లు పట్టుకొని నానా అవస్థలు పడ్డారు. సగానికి పైగా మహిళలు ఆకలితో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ముఖ్యనాయకులకు చికెన్ పెట్టి మహిళలకు వంకాయ, శనగల కూరతో సరిపెట్టారు.



మెంటాడ: సొమ్మసిల్లి పడిపోయిన మహిళ



రాజాంలో సభ మధ్యలోనే వెనుదిరిగిన మహిళలు

తోపులాట..

జామి/మెంటాడ: జామి మండలం కుమరాం, మెంటాడ మండలం కైలాం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఆసరా సభలో ఏర్పాటు చేసిన భోజనాల వద్ద తోపులాట చోటుచేసుకుంది. ఈ సభలకు వేలాదిమందిని తరలించేందుకు దృష్టిపెట్టిన నేతలు వారికి భోజనాల కల్పనలో నిర్లక్ష్యం వహించారు. కైలాంలో భోజనాల కౌంటర్ వద్ద తొక్కిసలాట జరిగి జామి ఎల్లమ్మ అనే మహిళ సొమ్మసిల్లి పడిపోయింది.

రైతుల అంగీకారం లేకుండా 'సుజల స్రవంతి'ని ఎలా డిజైన్ చేశారు?

- దీనివల్ల వారికి తీవ్ర నష్టం జరుగుతుంది
- పరిహారం మెరుగ్గా అందజేయాలి
- నిర్వాసితుల సదస్సులో సీపీఎం, టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

గంట్యాడ, ఫిబ్రవరి 2: రైతుల అంగీకారం లేకుండా, గ్రామ సభలు పెట్టకుండా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు డిజైన్ ఎలా రూపొందించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజె క్టులు ఏర్పాటు చేసే ముందు రైతులను దృష్టిలో పెట్టుకుని డిజైన్‌లు ఉండాలని చెప్పారు. శుక్రవారం తాటిపూడి గ్రామం వద్ద 8 మండలాలకు చెందిన సుజల స్రవంతి భూ నిర్వాసితులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుజల స్రవంతి ఫేస్-2లో ప్యాకేజీ 1,2లో జిల్లాలోని కొత్తవలస మండలం నుంచి గుర్ల మండలం గడిగెడ్డ వరకూ కాలువ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు ప్రభుత్వం గత రెండేళ్ల నుంచి ఎలైన్మెంట్ చేసి భూసేకరణ కోసం నోటిఫికేషన్ ఇస్తున్న నేపథ్యంలో కాలువ ప్రతిపాదిత గ్రామాల రైతుల అంగీకారం లేకుండా, గ్రామ సభలు పెట్టకుండా ప్రాజెక్టు డిజైన్ చేశారని ఆరోపించారు. ఈ డిజైన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంద ని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే భూసేకరణను వారు అడ్డుకున్నట్లు తెలిపారు. దీనిని పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి భూసేకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు ముర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అధికంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కోసం రైతుల భూములను బ్లాక్ లిస్టులో పెట్టడం తగదన్నారు. దీనివల్ల ఆడపిల్లల పెళ్లి కోసం భూములు అమ్ముకోవడానికి కొందరు రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఈ నెలలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటన ఉందని, ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్తామన్నారు. రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలిపారు. ఎస్.కోట మాజీ శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ.. రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలో రైతులకు నష్టాలు తప్ప లాభాలు లేవని చెప్పారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ.. తాను పాలక పక్షంలో ఉన్నా రైతు పక్షపాతిగా ఈ సమావేశానికి వచ్చినట్లు చెప్పారు. ప్రాజెక్టు డిజైన్ రూపొందించిన అధికారులకు రైతుల సమస్యలు తెలిసి ఉండక పోవచ్చని, దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడతా మని, అవసరమైతే సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా అధ్యక్షుడు టి.సూర్యనారాయణ, రైతు సంఘం నాయకులు బి.రాంబాబు, చల్లా జగన్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

- 'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో టీడీపీ నాయకులు
- చంద్రబాబును గెలిపించాలని వాడవాడలా ప్రచారం


విజయనగరం: అదితి ఆధ్వర్యంలో..


సీతంపేట: పులిగుమ్మిలో..


పార్వతీపురంలో..


పార్వతీపురం రూరల్: బాలగొడబలో..

విజయనగరం (ఆంధ్రజ్యోతి): సైకోజగన్ పాలన, వైసీపీ పెద్దల నిర్ణయాలతో అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్ అధోగతి పాలైందని, టీడీపీతోటే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుందని విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు చెప్పారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో శుక్రవారం 41, 32 డివిజన్ల పరిధిలోని కంటోన్మెంట్, అంబేద్కర్ కాలనీ, రెల్లివీధి, బజారువీధి, చాకలివీధి, ఎస్‌సీ కాలనీ, ముత్యాలమ్మ చెరువుగట్టు, యాతవీధి, గణేష్ కాలనీతో పాటు, మండల పరిధిలోని బియ్యాలపేట గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి సూపర్‌సిక్స్ హామీలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించిన అతిథి గజపతిరాజుకి ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ నాయకుడు కండువా ప్రకాష్, మాజీ కౌన్సిలరు కరణం విజయకుమారితో పాటు, నగర, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● **సీతంపేట:** పులిగుమ్మి గ్రామంలో టీడీపీ నాయకురాలు పడాల భూదేవి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ పాలనలో గిరిజనులకు అందే సంక్షేమ పథకాలపై వివరించారు. వైసీపీ పాలనలో పథకాలు తొలగించారన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వల్ల ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా ఉండిపోతున్నాయని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బిడ్డిక జయలక్ష్మి, సీనియర్ నాయ కులు సవర మంగయ్య, సవర మల్లేష్, సవర భాస్కరరావు, మోహన్‌రావు తది తరులు పాల్గొన్నారు. ● **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** పార్వతీపురం పట్టణంలో కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం విస్తృతంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం కౌన్సిలర్ బడే గౌరునాయుడు ఆధ్వర్యంలో తన వార్డులో ఇంటింటికి వెళ్లి మినీ మ్యానిఫెస్టోపై వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

● **పార్వతీపురం రూరల్:** మండలంలోని బాలగొడబ గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్రకు శుక్రవారం సాయంత్రం ఘన స్వాగతం లభించింది. గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బాలగొడబ గ్రామంలో టీడీపీ నాయకులు పాదాలనాయుడు, భాస్కరరావు ఆధ్వర్యంలో విజయచంద్రకు స్వాగతం పలికారు. విజయచంద్ర ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై వివరించారు. అనంతరం అధిక సంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి చేరారు. వైసీపీ ఎంపీటీసీ వంగపండు నీలకంఠం తదితరులు చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంట్యాడ: నీలావతి గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొని, వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, పార్టీ నాయకులు అల్లు విజయకుమార్, రంధి చినరామునాయుడు, వేమలి చైతన్యబాబు ఉన్నారు.

బహిరంగ ధూమపానం నిషేధం

క్రైం: ధూమపానం హానికరమని, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చెయ్యటం వలన ప్రజారోగ్యానికి హాని కలుగుతుందని ఏస్పీ దీపిక పాటిల్ అన్నారు. రాష్ట్ర ప్రజారోగ్యశాఖ, ప్రభుత్వ ఆదేశాల మేరకు పొగాకు చట్టం అమలు చేసేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పొగాకు ఉత్పత్తుల వల్ల జరిగే అనారోగ్య సమస్యలపై ఎస్పీ గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఇకపై బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసినా, విద్యాసంస్థల దగ్గరలో, మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విశాఖ మెడికవర్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కార్తిక్ చంద్ర మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వినియోగం వలనే 90 శాతం ప్రజల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లు వస్తున్నాయన్నారు. అదనపు ఎస్పీ అస్మాపరహీన్, డీసీఆర్బీ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డా క్టర్ సౌజన్య, డీసీఆర్‌బీ సీఐ మురళీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో ఆర్‌బీకే ప్రారంభం

బొబ్బిలి: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో 23.94 లక్షల రూపాయల ఉపాధి నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, సీసీ రోడ్లను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పల నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాల నాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, సర్పంచ్ గంట సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మార్చి 5 నుంచి మున్సిపల్ వర్కర్స్ మహాసభలు

దాసన్నపేట: మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా మహాసభలు మార్చి 5, 6 తేదీల్లో జిల్లాలో నిర్వహిస్తున్నామని, ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్మోహన్ రావు అన్నారు. శుక్రవారం తోటపాలెం ఎల్.బి.జీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమల కోసం దశలవారీగా ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇంజినీరింగ్ వాటర్ వర్కర్స్, పంప్‌హౌస్ కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ తీసుకుంటామన్నారు. యూనియన్ నాయకులు భాస్కర్‌రావు, కుమారి, రాఘవ, రజనీ తదితరులు పాల్గొన్నారు.

కొండ డాబాలో ప్రత్యేక పూజలు

కొత్తవలస: కొండడాబా వ్యాకులమాత మహోత్సవాల సందర్భంగా 8వ రోజు నవీన ప్రార్థనలలో భాగంగా వివిధ ప్రత్యేక కార్యక్రమాలని కొండపై నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. తన కుమారుని గురించి తల్లి మరియ పడిన వేదనను విచారణకర్తలు వివరించారు. ఏసు పుట్టిన దగ్గర నుంచి ఎన్నో కష్టాలను అనుభవించారని, అవి అన్ని తన భక్తుల కోసమే నని తెలిపారు. విచారణకర్తలు టి.ప్రతాప్, మైకేల్, ఎన్.నరేష్, జీవన్, పి.జోజయ్య, రాజు గొంగాడ పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలు కుష్టు కావచ్చు

కొత్తవలస: స్పర్శలేని మచ్చలను కుష్టువ్యాధిగా అనుమానించవచ్చునని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలో గల రామలింగాపురం గ్రామంలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శరీరంపై రాగి రంగులో గాని, గోదుమ రంగులో గాని స్పర్శ లేని మచ్చలు ఉంటే పరీక్షలు చేయించుకుని మందులను వాడుకుంటే పూర్తిగా నయమవుతుందన్నారు. వీటిని ప్రాథమిక దశలో ఉన్నట్టుగా గుర్తించి చికిత్స చేయంచుకుంటే త్వరగా కోలుకునే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది సత్యారావు, మోహనరావు, పద్మావతి, గీతిక, వి లక్ష్మి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు నైతికతపై పరీక్ష

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నైతికత, మానవ విలువలపై పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలను పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు. అధ్యాపకులు జయలక్ష్మి, శివాజీ, రాజేష్, మూర్తి, రహీంలాల్, సురేంద్రనాథ్ పరిశీలించారు.

గాంధీ పార్కు అభివృద్ధికి భూమి పూజ

శృంగవరపుకోట: స్థానిక దేవీ గుడి కూడలి సమీపంలో గాంధీ పార్కు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భూమి పూజ చేశారు. ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, మేజర్ పంచాయితీ సర్పంచ్ సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

జామి: మండలంలోని జట్టేడివలస గ్రామంలోని దుర్గాదేవి గుడి వద్ద కొద్దిరోజులుగా బోరుబావి పని చేయ డం లేదు. ఈ విషయాన్ని పంచాయతీ పట్టించుకోకపోవడంతో స్థానిక టీడీపీ నేత రాయవరపు శంకరరావు స్పందించారు. శుక్రవారం తన సొంత నిధులతో బోరుబావిని బాగుచేయించి గ్రామస్తుల దాహార్తిని తీర్చారు.

బ్లాక్‌లో వంటగ్యాస్

రేగిడి: అంబఖండి గ్రామంలో వంటగ్యాస్‌ను బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. సిలిండర్‌కు రూ.వంద నుంచి రూ.200 అధికంగా తీసుకొని ఊరి మధ్యలో అమ్మకాలు సాగిస్తున్నారు. హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు పదుల సంఖ్యలో తెచ్చి ఒకేచోట నిల్వ ఉంచి విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు అనధికార డీలర్షిప్ నడుపుతున్నా ఎవరూ అటువైపు తొంగి చూడకపోవటం గమనార్హం. దీనిపై వీఆర్వో నాగరాజును వివరణ కోరగా గ్యాస్ విక్రయాల విషయం తన దృష్టికిరాలేదని, దీనిపైచర్యలు తీసుకొంటామన్నారు.

చిత్తడి నేలల దినోత్సవం

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు కె.వాసు దేవరావు, ఆర్.శ్రీలక్ష్మి, జి.సురేష్, డి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నిధి వసూలు


ప్రజానిధిని వసూలు చేస్తున్న సీపీఎం ప్రతినిధులు

దాసన్నపేట: దేశంలో, రాష్ట్రంలో ఎన్నికల బాండ్లు తీసుకోకూడదని నిర్ణయించిన ఏకైక పార్టీ సీపీఎం అని రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అన్ని పార్టీలు ప్రజలకు డబ్బులు ఇచ్చి ఓట్లు కొనుక్కునే సంస్కృతిని ప్రోత్సహిస్తే.. సీపీఎం ప్రజల వద్దకు వెళ్లి నిధిని వసూలు చేసి ప్రజా పోరాటాలకు ఖర్చు చేస్తుందని చెప్పారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నగరంలో ఇంటింటికీ వెళ్లి నిధి వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రెడ్డి శంకరావు, రమణమ్మ, జగన్మోహన్, రమణ, లక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాల్సిందే

● మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట, ఫిబ్రవరి 2: సుజల స్రవంతి భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని శృంగవరపుకోట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం తాటిపూడిలో జరిగిన భూ నిర్వాసితుల సదస్సుకు మద్దతు ఇచ్చారు. వీరిని ఉద్దేశించి మాట్లాడారు. అభివృద్ధి పనులకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యతిరేకం కాదన్నారు. రైతులకు నష్టం కలిగేలా ప్రభుత్వం వ్యవహరించడాన్ని తప్పు పడుతున్నామన్నారు. నిర్వాసిత రైతుల ప్రయోజనాల కోసం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

బీసీలను నట్టేట ముంచారు


మాట్లాడుతున్న బేబీనాయన

తెర్లాం, ఫిబ్రవరి 2: బీసీలకు రిజర్వేషన్లు, ఉద్యోగాల కల్పనలో నమ్మించి ఈ ప్రభుత్వం నట్టేట ముంచిందని బొబ్బిలి నియోగజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జి బేబీనాయన అన్నారు. శుక్రవారం మండలంలో నెమలాం గ్రామంలో ఏర్పాటు చేసిన జయహో బీసీ సభలో పాల్గొన్నారు. ఆయన వైసీపీ ప్రభుత్వంపై మాటల తూటాలు సంధించారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ బీసీలను నయవంచనకు గురిచేసి మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ఇప్పుడు వారిని తుంగలోకి తొక్కారన్నారు. అనంతరం ఊరేగింపుగా గ్రామంలో పర్యటించారు. మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, ఎంపీపీలు వెంకటేష్, సింహాచలం, గ్రామ నాయకులు వెంకటనాయుడు, ఆనంద్, త్రినాథ్, రమేష్, వివిధ గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భోజన నిర్వాహకుల వేతనాలు పెంచాలి



ధర్నా చేస్తున్న దృశ్యం

రామభద్రపురం, ఫిబ్రవరి 2: మధ్యాహ్న భోజన నిర్వాహకుల వేతనాలు పెంచాలని కోరుతూ ఎంఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు బలసా శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో వారు మాట్లాడుతూ నిత్యవసరాల ధరలు పెరిగిపోతుండడంతో ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు సరిపోవడం లేదన్నారు. వీటిని వెంటనే పెంచాలని కోరారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, వేతనదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఈనెల 5న డీఈవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంఈవో ఆమిటి తిరుమలప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నగపాలక సంస్థ కమిషనర్‌గా మల్లయ్యనాయుడు


బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లయ్య నాయుడు

రింగురోడ్డు: విజయనగరం నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా ఎం.మల్లయ్య నాయుడు శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ అందరి సహకారంతో నగరభివృద్ధికి కృషిచేస్తామన్నారు. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

జిందాల్ భూములను వెనక్కివ్వాలి



జిందాల్ పరిశ్రమ కార్యాలయం బోర్డు వద్ద నాయకులు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 2: మండలంలో జిందాల్ పరిశ్రమ ఏర్పాటుకు 15ఏళ్ల క్రి తం రైతుల నుంచి వందల ఎకరాల భూమిని సేక రించిన ప్రభుత్వం ప్రస్తు తం అందులో ఎటువంటి పరిశ్రమలు నేటివరకు ఏర్పాటు చేయించలేదని, ఈ తరుణంలో ఈ భూములను తిరిగి రైతులకు ఇప్పించాలని సీపీఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న జిందాల్ కార్యాలయం వద్ద వారు విలేఖర్లతో మాట్లాడారు. చట్టప్రకారం రైతులకు భూములు ఇప్పించాలని, రైతులు తమ భూములు సాగుచేసుకోవడానికి సి ద్ధంగా ఉండాలని వారి తరపున సీపీఎం, రైతు వ్యవసాయ సంఘం, కార్మిక సం ఘం ఉంటాయన్నారు. కార్యక్రమంలో మర్రపు సూర్యనారాయణ, బుద్ద రాంబా బు, చల్లా జగన్, ఆదినారాయణ, గాడి అప్పారావు, మద్దిల రమణ, నానిబాబు తదితరులున్నారు.

5న మధ్యాహ్న భోజనం వంటల బంద్



ఎంఈవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఎండీఎం నిర్వాహకులు

బొబ్బిలి, ఫిబ్రవరి 2: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న వంటలను బంద్ చేస్తున్నట్లు ఆ సంఘ నాయకులు తెలిపారు. స్థానిక ఎంఈవో కార్యాలయం ముందు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు రామలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకం లక్ష్యాలను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. సీఎం జగన్ అధికారంలోకి రాక మునుపు తమకు రూ.10వేల వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చారని... సీఎం అయ్యాక ఆ హామీని మరిచిపోయారన్నారు. ప్రతి నెలా 5 లోగా వేతనాల బిల్లులు చెల్లించాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఎంఈఓ చల్లా లక్ష్మణ రావుకు వినతిపత్రం అందజేశారు. వారి వెంట సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

8న ఆశా వర్కర్ల చలో విజయవాడ


డాక్టర్ సంతోషికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

బొబ్బిలి, ఫిబ్రవరి 2: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంఘ నాయకులు తెలిపారు. స్థానిక పీపీ యూనిట్ వైద్యాధికారి డా క్టర్ సంతోషి కుమారికి యూనియన్ అధ్యక్షురాలు లంక శాంతమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెల వులు, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు అమలు చేయాలని, ఆరోగ్యేతర అంశాలకు సంబంధించిన పనులను పురమాయించరాదని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో సమ్మె చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శాంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌరసేవల్లో అలసత్వం వద్దు


ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, ఫిబ్రవరి 2: పట్టణ ప్రజల సేవలకు సంబంధించి ఎటువంటి అలసత్వం చూపవద్దని, తక్షణ మే వారికి సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదే శించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె శుక్రవారం తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రాధాన్య క్రమంలో పనులన్నిటినీ పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బందితో సమన్వయంతో పనిచేసి నాణ్యమైన సేవలందించాలని ఆదేశించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నిటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పోషకాహారాన్ని పక్కాగా అందించాలి


మాట్లాడుతున్న సూపర్వైజర్ ఎర్రయ్యమ్మ

విజయనగరం దాసన్నపేట : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకా హారాన్ని బాలింతలు, పసిపి ల్లలకు అందేలా కేంద్ర నిర్వా హకులు శ్రద్ధ వహించాలని అర్బన్ సెక్టార్-3 సూపర్‌వైజర్ ఎర్రయ్యమ్మ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం ధర్మపురిలోని 3వ కేంద్రంలో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వాలు అందజేస్తున్న పోషకాహారాన్ని పిల్లలు, బాలింతలకు అందించాలని సూ చించారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకురాలు రమాదేవి, సహాయకురాలు బాలి మాణిక్యదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. పూర్తికాని నిర్మాణం

● సగంలో నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనం


నిర్మాణం పూర్తి కాని భవనం


భవనం అద్దాలు పాడైన దృశ్యం

రేగిడి, ఫిబ్రవరి 2: స్థానిక తహసీల్దార్ భవనం శిథిలావస్థలో ఉండటంతో 2018లో అప్పటి కలెక్టర్ ధనంజయరెడ్డి కొత్త భవనం నిర్మాణానికి రూ.90లక్షలు మంజూరు చేయించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం దీనికి రూ.67లక్షలు కేటాయించింది. తొమ్మిది నెలల్లో అన్ని హంగులతో భవనం పూర్తి చేయాలని అప్పట్లో కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇంతలో ప్రభుత్వం మారటంతో పనులు చేసినా బిల్లులు కాని పరిస్థితి తలెత్తింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లు పూర్తవుతున్నా ఈ భవన నిర్మాణం పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ మధ్యలో పనులు విడిచిపెట్టాడు. భవనం పూర్తి కాకపోవడంతో రెవెన్యూ సిబ్బందికి వసతి సమస్య వేధిస్తోంది. దీనిపై రాజాం ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణరావును వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపు సమస్య ఉందని తెలిపారు. ఈ భవనానికి రూ.67లక్షలు కేటాయించారని, ఇప్పటి వరకు రూ.35 లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించామని.. ఇంకా రూ.32 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని..ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు.

బాలిక ఆత్మహత్య

పాలకొండ: బాలిక ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు, పాలకొండ ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక గొడగల వీధికి చెందిన పాలవలస చిన్న, సంతోషి దంపతులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కాగా, కుమార్తె తేజేశ్వరి(16) పాలకొండలోని ఓ బట్టల షాపులో నాలుగునెలల నుంచి పనిచేస్తోంది. ఈ క్రమంలో జాగ్రత్తలను సూచి స్తూ, తల్లితండ్రులు శుక్రవారం తేజేశ్వరిని మందలించారు. దీంతో మనస్థాపానికి గురై శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు పాలకొండ ఎస్ఐ ప్రశాంత్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాల నేరస్థునికి రెండేళ్ల శిక్ష

సాలూరు రూరల్: పోక్సో కేసులో బాలనేరస్థునికి రెండేళ్ల జువనైల్‌హోం (బాల సంరక్షణ గృహం)నకు పంపిస్తూ విజయనగరం బాల న్యాయమండలి తీర్పు నిచ్చినట్టు సాలూరు పట్టణ సీఐ జీడీ బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాలూరులో సెప్టెంబర్ 8, 2020లో ఆరేళ్ల పాపపై ఒక బాలుడు అత్యాచారం చేశాడు. బాలునిపై పోక్సో కేసు నమోదు చేసి దిశ డీఎస్పీ ఎం. శ్రీనివాసరావు దర్యాప్తు చేశారు. ఈ కేసులో నేరం నిరూపణ కావడంతో బాల న్యాయమండలి బాలనేరస్థునికి సత్ప్రవర్తన నిమిత్తం రెండేళ్ల జువనైల్ హోంకు పంపిస్తూ తీర్పు వెలువరించిందని సీఐ తెలిపారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

జియ్యమ్మవలస: మండలంలో కన్నపుదొరవలస పంచాయతీ సుభద్రమ్మవలస గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు శుక్రవారం ఉదయం అదృశ్యమైనట్లు బాధిత తండ్రులు చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ పత్తిక కాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుభద్రమ్మవలస గ్రామానికి చెందిన యామల కుసుమ(14), వైకుంఠం నీరజ (17) ఇరువురు గురువారం రాత్రి యామల కుసుమ ఇంట్లో నిద్రించారు. ఉదయం లేచిన వెంటనే ఆమె తండ్రి సూర్యనారాయణ చూసేసరికి ఇద్దరూ ఇంట్లో కనిపించకపోవడంతో కొంత ఆందోళన చెంది వైకుంఠం నీరజ తండ్రి వెంకటనాయుడుకు విషయం తెలియజేశాడు. వారు గ్రామంలో వెతకడంతో పాటు వారి బంధువుల ఇళ్లకు ఫోన్ చేసినా ఎక్కడా కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని ఏఎస్ఐ కాసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే చినమేరంగి ఎస్ఐ సెల్ నెంబరు 9121109478కు గాని, ఫిర్యాది సూర్యనారాయణ సెల్ నెంబరు 9989791165కు తెలియజేయాలని ఆయన కోరారు.

అక్రమ మద్యం తరలింపుపై కేసులు

బొబ్బిలి, ఫిబ్రవరి 2: బొబ్బిలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్‌గా గత నెల 22న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇంతవరకు అక్రమ మద్యంపై 11 కేసులు నమోదు చేసి 11 మందిని అరెస్టు చేసినట్లు సీఐ జీవీ మురళీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అక్రమ మద్యం, నాటుసారా తయారీపై గట్టి నిఘా పెడతామని, ఎప్పటికపుడు దాడులు నిర్వహించి నివారణ చర్యలు చేపడతామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి యువత అలవాటు పడకుండా మెలిగేలా విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీఐ మురళీధర్ తెలిపారు.

పశు సంవర్ధకక శాఖ డివిజన్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు

రింగురోడ్డు: పశువైద్యంలో ఉత్తమ సేవలందించినందుకు గాను విజయనగరం పశు సంవర్ధక శాఖ డివిజన్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. విజయవాడలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలో పశువైద్య రంగంలో సేవలు అందించిన అధికారులు, ఇతరులకు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక, పాడి పరిశ్రమల శాఖల మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.వి.రమణ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డీడీ ఎ.వి. రమణను ఆ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

మహిళలను సంపన్నులుగా చేశాం

● విజయనగరం ఎంపీ బెల్లాన

రాజాం రూరల్, ఫిబ్రవరి 2: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ప్రభుత్వం కృషి చేసిందని విజయనగరం ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఆసరా, చేయూత తదితర పథకాలతో మహిళలను సంపన్నులను చేశామని అన్నారు. అంతకాపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఆసరా సదస్సులో ఎం.పి. బెల్లాన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాజాం మున్సిపాలిటీతో పాటు మండలంలోని 6,500 మంది మహిళలకు నాలుగో విడత ఆసరా నిధులను బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డా.తలే రాజేష్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు..

పాఠశాల్లో మరుగుదొడ్లు వినియోగించాల్సిందే


మరుగుదొడ్ల వినియోగంపై హెచ్‌ఎంను ఆరాతీస్తున్న ఎంఈవో

రేగిడి, ఫిబ్రవరి 2: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు విధిగా వినియోగించాల్సిందేనని, ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే పేరెంట్స్ కమిటీతో చర్చించి... వీటిని వినియోగంలోకి తేవాలని ఎంఈఓలు వరప్రసాదరావు, బి.ఎరకయ్య ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. దేవుదళ హైస్కూల్, పుర్లిపేట ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఎంఈవోలు పరిశీలించారు. దేవుదళ హైస్కూల్‌లో మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటంతో హెచ్‌ఎం రాజ్యలక్ష్మిని వివరణ కోరారు. తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అంతకుముందు పుర్లిపేట ప్రాథమిక పాఠశాలను పరిశీలించి... 4, 5 తరగతుల పిల్లల ఇంగ్లీష్ అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు.

పారిశుధ్యం మెరుగుపర్చండి


ధర్మవరం యాతవీధిలో రోడ్డుపై మురుగునీరు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని ధర్మవరం పంచాయతీలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని యాతపేట వాసులు కోరుతున్నారు. గడి చిన కొద్దిరోజులుగా కాలువల్లోని నీరు రోడ్ల పైకి ప్రవహిస్తోందని... దుర్వాసన రావ డంతో పాటు అందులో నుంచే తమ ప్రయాణాలు సాగుతున్నాయన్నారు. దీని వల్ల వ్యాధుల బారిన పడతామని.. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు

● మాజీ మంత్రి శత్రుచర్ల ● టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు

కొమరాడ: వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు జరుగుతున్నాయని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ శేఖర్‌పాత్రుడు అధ్యక్షతన శుక్రవారం స్థానిక జంఝావతి జంక్షన్‌లో జయహో బీసీ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన విజయరామరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీలను అణగదొక్కుతోందని అన్నారు. హరిజన, గిరిజనుల హక్కులను కాలరాసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఆరోపించారు. టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా గుర్తుకు రాని మెగా డీఎస్సీ.. ఎన్నికల దగ్గర పడటంతో గుర్తుకు వచ్చిందా.. అని ప్రశ్నించారు. ఇది కేవలం నిరుద్యోగ యువతను మోసం చేయడానికి వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న జగన్నాటకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి.వీరేష్ చంద్రదేవ్‌తో పాటు జనసేన, టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొమరాడ: మాట్లాడుతున్న మాజీ మంత్రి విజయరామరాజు

టీడీపీతోనే బీసీలకు న్యాయం

గజపతినగరం: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ బీసీలకు పెద్ద పీట వేశారని.. చంద్రబాబునాయుడు ఆయన ఆశయాలకు అనుగుణంగా బీసీలను ముందుకు నడిపిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఏ నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేఏ నాయుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీల సంక్షేమానికి ఎన్నో నిధులు కేటాయిస్తే వైసీపీ వాటిని తుంగలోకి తొక్కిందన్నారు. కార్పొరేషన్ పేరుతో నిధులను దిగమింగిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం, గంట్యాడ మండల పార్టీల అధ్యక్షులు ఎ.లక్ష్మునాయుడు, కొండపల్లి భాస్కరనాయుడు, రాష్ట్ర నాయకులు పీవీవీ గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, డాకి నారాయణప్పలనాయుడు, లెంక బంగారునాయుడు పాల్గొన్నారు.

టీడీపీ 'గుడ్‌మార్నింగ్ పాలకొండ'



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జయకృష్ణ

పాలకొండ: టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం 'గుడ్‌మార్నింగ్ పాలకొండ' కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని కోట దుర్గమ్మ ఆలయం వెనుక ప్రాంతం, 15, 16, 17, 18, 19 వార్డులతో పాటు కస్పావీధి సెంటర్ వరకు ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రజలు మంచి నీటి సమస్యలను విన్నవించారు. మరికొన్ని ప్రాంతాల్లో రేషన్‌కార్డుల సమస్యలపై తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ వెన్నపు శ్రీను, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుంకరి అనీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయం

మక్కువ: టీడీపీ గెలుపే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెంట తిరుపతిరావు అన్నారు. స్థానిక సత్యసాయి భగవాన్ కల్యాణ మండపంలో ఆయన శుక్రవారం కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ గెలుపునకు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తుంటే ఇతరులు విమర్శలు చేయడం సరికాదన్నారు. మండలంలో పార్టీ పటిష్టతకు నిబద్ధతతో కృషి చేశానని చెప్పారు. టీడీపీ సాలూరు మండల నాయకురాలు ఎం.తేజోవతి మాట్లాడుతూ ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, పార్టీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తీళ్ల పోలినాయుడు, చొక్కాపు బుచ్చినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జయకృష్ణ వెంటే నడుస్తాం



మాట్లాడుతున్న ముఖలింగం

సీతంపేట: మండలంలోని 53 పంచాయతీలో ఉన్న టీడీపీ కార్యకర్తలంతా పార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ వెంటే నడుస్తామని పార్టీ మండల అధ్యక్షుడు సవర తోట ముఖలింగం అన్నారు. శుక్రవారం టీడీపీ మండల కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో నిమ్మక జయకృష్ణ విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ కోఆర్డినేటర్ హిమరిక పవన్, సర్పంచ్ నీలయ్య, పార్టీ నాయకులు రంగనాథం, గంటా సుధ, షోడగో తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీ చేరికలు



టీడీపీలోకి చేరినవారితో నాగార్జున

మెరకముడిదాం: ఉప్పలవలస గ్రామానికి చెందిన 90 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. శుక్రవారం రాత్రి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున సమక్షంలో రౌతు వేణునాయుడు, రౌతు ఆనంద్, మరో 90 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో తాడ్డి సన్యాసినాయుడు, కెంగువ ధనుంజయ్, కెల్ల శ్రీరామ్, గుర్ల మండల పార్టీ నాయకులు సన్యాసినాయుడు తదితరులు వున్నారు. ● **గుర్ల:** గరికవలస గ్రామానికి చెందిన ఎస్.గోవిందరావుతో పాటు పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. శుక్రవారం చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో వీరంతా పార్టీలో చేరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునను మాజీ ఎంపీటీసీ సంచాలన లక్ష్మంనాయుడు, కుమారుడు గోవిందరావు, రాజన్న కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనిమెరక కృష్ణ, బూత్ ఇన్‌చార్జి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పర్యటనను విజయవంతం చేయండి

పాలకొండ: పాలకొండలో ఈనెల 7న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ కోరారు. పాలకొండలోని షిర్డీసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. శంఖారావం పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, అరకు పార్లమెంటరీ బీసీ సెల్ కన్వీనర్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, అరకు పార్లమెంటరీ కార్యదర్శి పొన్నాడ నాగేశ్వరరావు, పార్టీ పాలకొండ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, పాలకొండ మండల పార్టీ అధ్యక్షుడు గండి రామినాయుడు, సీతంపేట, భామిని, వీరఘట్టం నాయకులు సవర తోట ముఖలింగం, మేడిబోయిన జగదీష్, జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీఎం నిర్వాహకులు

దత్తిరాజేరు: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎండీఎం కార్మికులతో కలిసి ఎంఈవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు బిల్లులు చెల్లించాలని కోరారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, సంవత్సరానికి 2 జతల యూనిఫాం ఇవ్వాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు విజయనగరం కలెక్టరేట్ వద్ద తలపెట్టనున్న ధర్నాలో భోజన కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.ఈశ్వరమ్మ, ఎ.భారతి, బి.సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించండి

● విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్: ఎన్నికల విధులలో ఉన్నవారు ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల విభాగం నుంచి వచ్చే ప్రతి పత్రం క్షుణ్ణం గా చదవాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రధానంగా ఐటీకి సంబంధించి ఎవరి లాగిన్, యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లు వారే స్వయంగా నిర్వహించాలని సూచించారు. బీఎల్‌వో లాగిన్‌లో ఉన్న సమాచారం, పాస్‌వర్డ్‌లు ఎవరికీ ఇవ్వరాదని చెప్పారు. సవరణల కోసం వచ్చిన దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు

తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా కురిమినెల్లి

గుర్ల: జమ్ము గ్రామానికి చెందిన కురిమినెల్లి మధుబాబును చీపురుపల్లి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా శుక్రవారం నియమించారు. ఈసందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మాట్లాడుతూ యువత పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.కిరణ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చనమల మహేశ్వరరావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు దుర్గాసి కోటేశ్వరరావు, ఐటీడీపీ నియోజవకర్గ అధ్యక్షుడు నాగులపల్లి నారాయణరావు, సీనియర్ నాయకుడు కె.బంగారునాయుడు.. మధుబాబును అభినందించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

రామభద్రపురం: రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా పరిపాలన జరుగుతోందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎంపీపీ లక్ష్మణరావు, జడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, మండల యువత అధ్యక్షులు పత్తిగుళ్ల ఏక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయండి

రాజాం: పాత పెన్షన్ సాధన కోసం ఈనెల 4న విశాఖలో తలపెట్టిన సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలని సీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొయ్యి శ్రీరాములు పిలుపునిచ్చారు. శుక్రవారం పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సీపీఎస్ ఉద్యోగులు అందరూ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, సత్యనారాయణ, కుమరాపు చంద్రినాయుడు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం



చిరుధాన్యాలు, విత్తనాలను పరిశీలిస్తున్న సంఘాల సభ్యులు

రాజాం: అంతకాపల్లి గ్రామంలో వైఎస్సార్ ఆసరా పంపిణీ సందర్భంగా నిర్వహించిన స్టాల్స్‌లో ప్రకృతి ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఆకర్షణీయంగా నిలిచింది. అక్కడ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడని చిరుధాన్యాలు, ఆకుకూరలు, దేశవాళీ వరి విత్తనాలు అందుబాటులో ఉంచారు. వీటిని స్థానికులు కొనుగోలు చేశారు. మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్.రమాదేవి, పాత్రుని వెంకటరమణ, ఐసీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలను రెన్యూవల్ చేసుకోవాలి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలోగల అన్ని దుకాణాలు, సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయించుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకూ చేయించుకోని సంస్థల యాజమానులు ఈనెల 29లోగా మీసేవ కేంద్రాల్లో గానీ, గ్రామ, డివిజన్ స్థాయి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. సంస్థలో కార్మికులు పనిచేస్తున్నా లేకపోయినా, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

నైపుణ్యాలతోనే భవిష్యత్తు

సాలూరు రూరల్: వృత్తి నైపుణ్యాల సాధనతోనే బంగారు భవిష్యత్తు సొంతం చేసుకోవచ్చునని పి.కోనవలస గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల విద్యార్థులను శుక్రవారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా డెంకాడ వాటర్ ప్లాంట్‌కు తీసుకువెళ్లారు.

డిగ్రీ ప్రవేశాలపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి కళాశాల ప్రిన్సిపాల్ వరం ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం వెబ్‌ల్యాండ్ ప్రయోగాలపై వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, హిస్టరీ లెక్చరర్ శ్రీవాణి, కెమిస్ట్రీ లెక్చరర్ చిన్నారావు పాల్గొన్నారు.

గిజబలో శివాలయ నిర్మాణం

గరుగుబిల్లి: గిజబ గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. తోటపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గిజబ గ్రామం ముంపునకు గురికావడంతో గ్రామ సమీపంలో పునరావాసం కల్పించారు. ఈ మేరకు గ్రామ సమీపంలో నూతనంగా శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. త్వరలోనే ప్రతిష్ఠ నిర్వహిస్తామని సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలి

● పార్వతీపురం మన్యం కలెక్టర్ నిశాంత్‌కుమార్

బెలగాం: జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు మొదటి స్థానం తీసుకురావాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ జట్లకు రూ.60 వేలు చొప్పున, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.30 వేలు చొప్పున, తృతీయ స్థానం పొందిన వారికి రూ.10 వేలు చొప్పున అందజేస్తారని తెలిపారు. బ్యాడ్మింటన్ పోటీల్లో మొదటి స్థానం పొందిన వారికి రూ.35వేలు, రెండో స్థానం పొందిన వారికి రూ.20వేలు, మూడో స్థానం పొందిన వారికి రూ.10వేలు చొప్పున ప్రభుత్వం ఇస్తుందని పేర్కొన్నారు. గెలుపొందిన జట్లకు కలెక్టర్ ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఎంహెచ్‌వో జగన్నాధరావు, జిల్లా ప్రాధికార సంస్థ అధికారి ఓన్.వెంకటేశ్వరరావు, డీఈవో ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● క్రికెట్ పోటీల్లో పురుషుల, బాలికల విభాగంలో సాలూరుకు చెందిన జట్లు మొదటి స్థానం సాధించాయి. కోకోలో పాలకొండకు చెందిన జట్లు పురుషుల, బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని సాధించాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో పురుషుల విభాగంలో పార్వతీపురానికి చెందిన జట్టు, బాలికల విభాగంలో కురుపాంకు చెందిన జట్టు మొదటి స్థానాన్ని సాధించాయి. కబడ్డీలో పురుషుల, బాలికల విభాగంలో పాలకొండకు చెందిన జట్లు మొదటి స్థానాన్ని సాధించాయి. బ్యాడ్మింటన్‌లో పురుషుల విభాగంలో పార్వతీపురం, బాలికల విభాగంలో కురుపాం జట్టు మొదటి స్థానాన్ని సాధించాయి.

ఐటీడీఏలో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలో ఉన్న అన్ని కార్యాలయాల ఉద్యోగులు, ఇతర సిబ్బందికి పీవో కల్పనాకుమారి ఆదేశాల మేరకు శుక్రవారం సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించామని ఐటీడీఏ ఉపవైద్యాధికారి విజయపార్వతి తెలిపారు. 79 మంది ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలు, పాఠశాలల్లో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పట్టణాభివృద్ధికి కృషి



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సింహాచలం

పార్వతీపురం టౌన్: పట్టణాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. శుక్రవారం ఇక్కడ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2021 నుంచి 2022 వరకు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. అధికారులు, ఉద్యోగుల సహకారాలతో 30 వార్డుల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు.

ఢిల్లీ ధర్నాలో బొబ్బిలి నేతలు



ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు విద్యాసాగర్

బాడంగి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తున్నా ప్రత్యేక హోదా, విభజన చట్టంలో ఉన్న హామీలు, ప్రత్యేక రైల్వేజోన్ హామీ ఇప్పటి వరకు నెరవేర్చలేదు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో బొబ్బిలి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మరిపి విద్యాసాగర్ (వినయ్) పాల్గొన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో ఉన్న గ్రోత్ సెంటర్, సుగర్ ఫ్యాక్టరీ రైతు సమస్యలను షర్మిలకు విన్నవించారు.

సమాజాన్ని మంచి మార్గంలో నడిపించాలి



మాట్లాడుతున్న జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విజయరాజ్‌కుమార్

పాలకొండ: సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే బాధ్యతను యువత తీసుకోవాలని పాలకొండ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల రక్షణ కోసం ఫోక్సో తదితర చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ వి.విజయలక్ష్మి, ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గొర్లెల సత్యంనాయుడు, ప్యానెల్ అడ్వకేట్ ఎం.వెంకటేశ్వరరావు, బొడ్డు రామ్మోహన్‌రావు, ఎం.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, రైతులు

పాచిపెంట: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ వల్ల సామాన్యులకు ఎటువంటి ఉపయోగం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు అన్నారు. పాంచాళి గ్రామంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో రైతులు, కార్మిక సంఘాలు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడిన విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా అభివృద్ధి కోసం ప్రస్తావన లేదన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్



మాట్లాడుతున్న మాధవ్

జియ్యమ్మవలస: ప్రతి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ విజయమే లక్ష్యంగా కింది స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. శుక్రవారం అర్నాడ పంచాయతీ వనజ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ కోర్ కమిటీ మెంబరు నిమ్మక జయరాజు అధ్యక్షతన కురుపాం, పాలకొండ నియోజకవర్గాల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పార్టీ వ్యవస్థను నిర్మిస్తూ ఎన్నికల్లో ఎలా వెళ్లాలనే ఆలోచనలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశాలు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో పల్లెకు పోదాం (గావ్ చలో) కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, ప్రతీ కార్యకర్త ఏదో ఒక గ్రామంలో 24 గంటలు ఉండి అక్కడి ప్రజలకు ఈ ప్రభుత్వం చేస్తున్న మోసాలను, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు, నిధులకు సంబంధించి ప్రజల్లో చైతన్యం చేయాల్సి ఉందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జయరాజు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వేప - వైసీపీ ప్రభుత్వం బెల్లంలా ఈ రాష్ట్రంలో ఉందన్నారు. అందరూ ఈ బెల్లం తిని మోసపోతున్నారని, ఒక్కసారి ఆరోగ్యానికి కావల్సిన వేప రుచి చూడాలని పిలుపునిచ్చారు. తరువాత కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిపై, వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఏళ్ల తరబడి ఉన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

● జిల్లా మలేరియా అధికారి జగన్మోహన్‌రావు



ప్రజలకు సూచనలు చేస్తున్న జగన్మోహన్‌రావు

వీరఘట్టం: వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. కత్తులకవిటి, రేగులపాడు గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో వాడుకలో లేని నీటిని, ఉపయోగంలో లేని పాడైన వస్తువుల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలను స్పెషల్ ఆఫీసర్‌గా సందర్శించి విద్యార్థుల ప్రగతి నివేదికలు, ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, హెచ్‌ఎం సుధారాణి, ఎంటీఎస్ భువనేశ్వర్, వైద్య సిబ్బంది మాధురి, కళావతి, పల్లవి, తిరుమలరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ జనార్దన్

బొబ్బిలి: పారాది, రాజచెరువువలస, బట్టివలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ జనార్దన్ శుక్రవారం పరిశీలించారు. ఆరు ఎకరాల్లో చేపట్టిన ఫాడర్స్, రింగ్ ట్రెంచెస్, ఫారమ్‌పాండ్స్, బౌండరీ ట్రెంచెస్ పనులను ఆయన పరిశీలించారు. బట్టివలసకు చెందిన గిరిజనులు రోజుకు రూ.270 చొప్పున వేతనం గిట్టుబాటయ్యేలా పనులు చేస్తుండడంతో ఏపీడీ వారిని అభినందించారు. ఆయన వెంట ఏపీఓ ఎ.లక్ష్మీపతిరాజు, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

రెండు పూటలా పని చేయాలి

రామభద్రపురం: ఉపాధి హామీ పథకం వేతనదారులు రెండు పూటలా పని చేయడం ద్వారా ఎక్కువ వేతనం పొందవచ్చునని ఏపీవో జి.త్రినాథరావు తెలిపారు. రామభద్రపురంలో శుక్రవారం వేతనదారులతో మాట్లాడారు. ప్రతిరోజూ రూ.273 వేతనం వచ్చే విధంగా పనులు చేయాలని సూచించారు. అనంతరం మస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

'దిశ'పై అవగాహన

పార్వతీపురం రూరల్: మహిళలపై జరిగే నేరాలపై అవగాహన ఉండాలని, దిశ యాప్ వినియోగించడాన్ని బాలికలందరూ తెలుసుకోవాలని ఎస్ఐ లావణ్య అన్నారు. శుక్రవారం నర్సిపురం ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, సోషల్ మీడియాతో వచ్చే ఇబ్బందులను ఎస్ఐ లావణ్య, పోలీస్ సిబ్బంది వివరించారు.

పుస్తకాలను వినియోగించుకోండి

పాలకొండ: సీతంపేట, పాలకొండ శాఖా గ్రంథాలయాల్లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం చదువుతున్న యువతీ, యువకుల కోసం పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు తెలిపారు. ఈ విషయాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

సారా స్వాధీనం

పాలకొండ: పట్టణంలోని వెంకంపేటలో కాలనీలో జగన్నాథస్వామి గుడి దగ్గరలో ఖాళీ ప్రదేశంలో ఎస్ఈబీ సిబ్బంది జరిపిన దాడుల్లో ద్విచక్రవాహనంతో 20 లీటర్ల సారా తరలిస్తున్న ముఖలింగం అనే వ్యక్తిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. సీతంపేట మండలానికి చెందిన ముఖలింగంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు.